పాలిటెక్నిక్‌ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

రామంతాపూర్‌ : జవహర్‌లాల్‌ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో గణితం, ఇంగ్లిష్, ఫిజిక్స్‌ బోధించే గెస్ట్‌ లెక్చరర్స్‌ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ వినయ్‌కుమార్‌ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 5 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9912342062.

బీఆర్‌ఎస్‌లోకి చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో చేరిన నాయకులు

గౌతంనగర్: ప్రజా సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణ బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌ నేతలు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ సునీత ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. వెంకటేష్, శ్రీనివాస్‌ కపూర్, సురేష్, కుమార్, సాంబతో పాటు పలువురిని ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు రాముయాదవ్, బైరు అనిల్, శ్రీనివాస్, భాను, సిద్ది రాములు, మల్లేష్‌యాదవ్, నగేష్, శ్రీను, కిట్టు, బిక్షపతి, సిద్దులు తదితరులున్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



మేడిపల్లి: భర్తతో గొడవపడి తన ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌ శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్న మేకల రాశి(26) కుమార్తెలు భవ్య(8)దివ్య(5)లను తీసుకుని గతనెల 27న ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం ఆమె సోదరుడు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భార్యభర్తల మధ్య గొడవల కారణంగానే ఆమె కనిపించకుండా పోయిందని సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాథ్స్‌ బోధనకు వనిత క్లబ్‌ అధ్యక్షురాలు

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్‌ ప్రభుత్వ స్కూల్‌లో ఓ సేవా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన వాసవి, వనిత క్లబ్‌ ప్రతినిధులకు మ్యాథ్స్, సైన్స్‌ బోధించే ఉపాధ్యాయులు లేరన్న విషయం తెలిసింది. దీంతో నేర్లకంటి ఉమా విద్యార్థులకు మ్యాథ్స్‌ బోధించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. శనివారం నుంచే ఆమె తరగతులు కూడా మొదలుపెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు విద్యను అందించే భాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. క్లబ్‌ తరఫున సైన్స్‌ బోధించే ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

అవార్డు ప్రదానం



మల్లాపూర్: ఈటీ ఎడ్యుకేషన్‌ లీడర్‌ షిప్‌ సమ్మిట్‌– 2025 అవార్డును నాచారం డెక్కన్‌ స్ప్రింగ్స్‌ గ్లోబల్‌ స్కూల్‌ చైర్మన్‌ నవనీతరావు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్సలెన్స్‌ ఇన్‌ లీడర్‌ షిప్, అడ్మినిస్ట్రేషన్‌ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యారంగంలో నైపుణ్యాలను మెరుగుపరుస్తూ.. విద్యార్థులకు విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు.

మర్యాద పూర్వక కలయిక



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న దళిత జనసమితి నేతలు

మల్లాపూర్: ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను దళిత జన సమితి ప్రతినిధులు కోరారు. శనివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీ,ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్‌ నిధులను నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఆర్థిక తోడ్పాటు, చిన్నపరిశ్రమల స్థాపనకు కృషిచేయాలన్నారు. దళిత జన సమితి వ్యవస్థాపకులు బొజ్జ యాదగిరి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బొజ్జ రమేష్, ఉపాధ్యక్షులు సంపత్, రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, సంపత్, మాజిద్, కుమార్, కృష్ణయ్య, తదితరులున్నారు.



విద్యార్థులతో మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ జాయింట్‌ డైరెక్టర్‌ సంధ్య



వనమహోత్సవంలో కమిషనర్‌ శైలజ తదితరులు

రీసైక్లింగ్‌తో పర్యావరణానికి మేలు

- మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ జాయింట్‌ డైరెక్టర్‌ సంధ్య.. సమీకృత వ్యర్థాల పార్కు సందర్శన
- పలుచోట్ల ఘనంగా వనమహోత్సవం
- మొక్కలు నాటిన ప్రజా ప్రతినిధులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి పర్వతాపూర్‌లోని సమీకృత వ్యర్థాల పార్కు (డంపింగ్‌యార్డు)ను శనివారం డైరెక్టర్‌ ఆఫ్‌ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ జాయింట్‌ డైరెక్టర్‌ సంధ్య, డిప్యూటీ డైరెక్టర్‌ సాయినాథ్‌తో కలిసి సందర్శించారు. అనంతరం 100 రోజుల కార్యాచరణలో నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పలు కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. స్వచ్ఛ్‌ పీర్జాదిగూడలో భాగంగా సమీకృత వ్యర్థాల పార్కును సందర్శించి, అక్కడ జరుగుతున్న తడి,పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. తడిచెత్తతో బ్రికెట్స్‌ తయారీ, కంపోస్టు తయారీ, పొడిచెత్తతో రీసైక్లింగ్‌ చేస్తున్న వివిధ ప్రక్రియలు, మిషనరీల పనితీరును పరిశీలించారు. అనంతరం మేడిపల్లి ప్రభుత్వ స్కూల్‌ విద్యార్థులు తయారుచేస్తున్న కంపోస్టింగ్, 100 రోజుల ప్రణాళికల్లో భాగంగా అవగాహన కోసం గోడలపై విద్యార్థులు వేసిన చిత్రాను పరిశీలించి, వన మహోత్సవంలో పాల్గొన్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, అసిస్టెంట్‌ మున్సిపల్‌ కమిషనర్‌ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్‌ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్, బాల మురళీకృష్ణ, మున్సిపల్‌ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అల్వాల్‌ చిన్నరాయుని చెరువు వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

వనమహోత్సవాన్ని విజయవంతం చేద్దాం..

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని బోడుప్పల్‌ కమిషనర్‌ శైలజ పిలుపునిచ్చారు. 4వ డివిజన్‌ పరిధిలోని పార్కులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు బాధ్యత తీసుకుని నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నారాయణరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అల్వాల్: వన మహోత్సవంలో భాగంగా శనివారం అల్వాల్‌లోని చిన్నరాయుని చెరువుకట్ట వద్ద ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డిలు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఆర్టికల్చర్‌ అధికారిణి ప్రవీణ, బీఆర్‌ఎస్‌ నేతలు డోలి రమేష్, యాదగిరిగౌడ్, శోభన్‌బాబు, శరణగిరి, ఢిల్లీ పరమేష్, లడ్డు, రహ్మత్‌ఖాన్, ఆరీఫ్, సురేష్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, అరుణ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి



పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ ఈటల , ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : డివిజన్‌ పరిధిలోని వెంకటసాయినగర్, సత్యానగర్, రామ్‌శంకర్‌నగర్‌లతో పాటు హబ్సిగూడ డివిజన్‌ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో శనివారం రూ.1.32 కోట్లతో డ్రైనేజీ పైపులైన్‌ పనులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కక్కిరేణి చేతనహరీష్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి పార్టీలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ఎజెండాగా పరస్పర సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డితో పాటు జల మండలి అధికారులు సంతోష్, రజనీకాంత్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ నేతలు గడ్డం సాయి కిరణ్, గంధం నాగేశ్వర్‌రావు, వెంకట్‌రావు, నవీన్, ఎల్లాచారి, పవన్‌ తదితరులున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



ఎంపీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

రామంతాపూర్ : పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు నియోజకవర్గానికి వచ్చిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి శనివారం ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, రామంతాపూర్‌ డివిజన్‌లో నెలకొన్న సమస్య పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. చిన్నచెరువు స్థలాన్ని పాఠశాలగా మార్చాలని, ప్రతి స్కూల్‌ల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేయాలని, తాగునీటి సౌకర్యం లేని స్కూళ్లల్లో నల్ల కనెక్షన్లు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజావాణి ప్రతినిధులు విజయ్‌కుమార్, కిరణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

మల్కాజిగిరి: బండచెరువుతో పాటు సఫిల్‌గూడ చెరువులో మురుగు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇరిగేషన్‌ అధికారులకు సూచించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సమీప కాలనీలో ప్రజలు దోమల బెడద, దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రత్యేక పైపులైన్‌ ఏర్పాటు చేసి మురుగు చెరువులో చేరకుండా చూడాలన్నారు. పైపులైన్‌ కోసం భూమి కోల్పోయి నిర్వాసితులతో త్వరితగతిన చర్చలు జరపాలని, తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అల్వాల్‌ చిన్నరాయుని చెరువు వద్ద అలుగు (బ్రిడ్జి) నిర్మించాలన్న స్థానికుల డిమాండ్‌ను పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. ఇప్పటికే చెరువులు అన్యాక్రాంతం అయిపోయాయని, ఉన్న వాటినైనా కాపాడుకుని స్వచ్ఛమైన నీరు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీఈ శుక్లజ్, ఏఈ శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ధర్నాకు తరలిన బీజేపీ నేతలు



ఇందిరాపార్కు ధర్నాకు తరలిన కార్పొరేటర్‌ శ్రవణ్‌



యాప్రాల్‌ నుంచి వెళ్తున్న బీజేపీ నేతలు

మల్కాజిగిరి: కామారెడ్డి డిక్లరేషన్‌ అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ.. ఇందిరాపార్కు వద్ద బీజేపీ చేపట్టిన ధర్నాకు మల్కాజిగిరి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రవణ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ అమలుపై కాంగ్రెస్‌ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. నందుయాదవ్, మురళీగౌడ్, బాబన్‌సింగ్, రవి, వెంకటేష్, రాజు, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: నగరంలోని ఇందిరాపార్కు వద్ద బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో శనివారం మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యాప్రాల్‌ల్‌ నుంచి బీజేపీ నేతలు తరలివెళ్లారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఎన్జీవో సెల్‌ కన్వీనర్‌ ధనలక్ష్మి, నాయకులు సత్యనారాయణబాబు, వెంకటేష్, విజయలక్ష్మి, కుమార్, రాజేష్, తదితరులున్నారు.

బీసీలకు మోసం చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

మౌలాలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశాల మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద శనివారం నిర్వహించిన ధర్నాకు జిల్లా అధికార ప్రతినిధి నవీన్‌కుమార్‌ నేతృత్వంలో బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, కామారెడ్డి డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. వినాయక్‌నగర్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్, సుశీల, జయమ్మ, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుషాయిగూడ: తన దృష్టికి వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం లభించేలా చూస్తానని మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ ప్రభుదాస్‌ అన్నారు. శనివారం ఆయన డివిజన్‌ పరిధిలోని శాంతినగర్, ఓల్డ్‌ మీర్‌పేట్, అన్నపూర్ణకాలనీలో పాదయాత్ర చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కాలనీల్లో తాగునీటి, డ్రైనేజీ సమస్యలను స్థానికులు కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. నరసింహగౌడ్, సంజయ్, రాకేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



చింతల ప్రసన్న

మేడిపల్లి: ఓ యువతి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బాలాజీహిల్స్‌ కాలనీలో నివాసం ఉంటున్న చింతల కన్నతల్లికి ఇద్దరు కుమార్తెలు. కాగా పెద్ద కుమార్తె ప్రసన్న(19) ఈనెల 1న ఉదయం 5.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

మల్లాపూర్: ఓల్డ్‌ మల్లాపూర్‌లోని ఈదమ్మ దేవాలయం, ఉప్పలమ్మ, పోతరాజు శిఖర ప్రతిష్టాపనోత్సవంలో భాగంగా శనివారం దేవాలయం వద్ద అన్నదానం చేపట్టారు. ముఖ్యఅతిథిగా మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. మల్లాపూర్‌ మాజీ కౌన్సిలర్‌ కేశవరం ఆంజనేయులు. ఈదమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, ఓల్డ్‌ మల్లాపూర్‌ గ్రామస్తులు పాల్గొన్నారు.

‘ఎన్‌ఎఫ్‌బీఎస్‌’ను సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్‌)ను సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్‌ కమిషనర్‌ శైలజ అన్నారు. శనివారం బోడుప్పల్‌లో ఆమె మాట్లాడుతూ.. ఎన్‌ఎఫ్‌బీఎస్‌ కింద ప్రాథమిక కుటుంబయజమాని (18 నుంచి 60) మరణిస్తే ఆ కుటుంబ పెద్దకు రూ.20 వేల ఎక్స్‌గ్రేషియా అందుతుందన్నారు. అర్హులు మున్సిపల్‌ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మృతి చెందిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం, దరఖాస్తుదారుడి ఆధార్‌ కార్డు (కుటుంబ పెద్ద), కుటుంబ రేషన్‌ కార్డులను ఈనెల 6 లోగా అందజేయాలన్నారు. మరింత సమాచారానికి మున్సిపల్‌ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నిమజ్జన ఏర్పాట్లలో ముందస్తు చర్యలు

మల్కాజిగిరి: ప్రతిఏటా గణేష్‌ నిమజ్జనం సందర్భంగా ఏర్పాట్లలో అధికారులు విఫలమవుతున్నారని ఈసారి అలా జరగకుండా చూడాలని గణేష్‌ ఉత్సవ సమితి నాయకులు మల్కాజిగిరి సర్కిల్‌ డీసీకి వినతిపత్రం ఇచ్చారు. అసెంబ్లీ కన్వీనర్‌ రుత్విక్‌ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఏర్పాట్లు ముందస్తుగా ప్రారంభించాలని కోరారు. గతేడాదిలా కాకుండా ఈసారి తీసుకోవాల్సిన చర్యలపై నిమజ్జన పర్యవేక్షణ అధికారి డీసీకి వినతిపత్రం అందజేశామన్నారు. దాసన్, రామకృష్ణ, అఖిలపక్ష నేతలు రమేష్, రాకేష్, గోపి, అనిల్, చంద్రశేఖర్, సురేష్‌ తదితరులున్నారు.



డీసీకి వినతిపత్రం ఇస్తున్న ఉత్సవ సమితి

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ఇన్వెస్టర్‌ సెర్మనీలో పాల్గొన్న కిశోర్‌గౌడ్‌

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ బీ బ్లాక్‌ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌ అన్నారు. నారాయణస్కూల్‌లో జరిగిన విద్యార్థుల కేబినెట్‌ ఇన్వెస్టర్‌ సెర్మనీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బ్యాడ్జ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అగ్ని, పృథ్వీ, నాగ్, త్రిశూల్, హౌస్‌ విద్యార్థులు నిర్వహించిన గ్రాండ్‌మార్చ్‌ పాస్ట్‌ ఎంతో ఆకట్టుకుందన్నారు. చిన్నతనం నుంచి నాయకత్వ లక్షణాలతో పాటు ఉన్నతస్థితిలో ఉండేందుకు కృషి చేయాలన్నారు. స్కూల్‌ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన డ్రైనేజీ పైపులైన్‌ ఏర్పాటు

మల్లాపూర్: నాచారం డివిజన్‌ పరిధిలోని రాఘవేంద్రనగర్‌ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్‌ పనులను శనివారం నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైన్‌ సరిపోకపోవడంతో కొత్త లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పనులు పూర్తయినా వెంటనే సీసీరోడ్డు వేయిస్తామన్నారు. జలమండలి మేనేజర్‌ సిరాజుద్దీన్, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ శివ, కాలనీవాసులు యాదగిరి, శేఖర్‌గౌడ్, కిట్టు, దేవేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, వెంకట్‌రెడ్డి, యాదగిరియాదవ్‌ తదితరులున్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతి

దశలవారీగా సమస్యల పరిష్కారం



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి: డివిజన్‌ మోడల్‌ సుధానగర్‌ కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. మోడల్‌ సుధానగర్‌ కాలనీలో త్రీ ఫేస్‌ విద్యుత్‌ సరఫరా, డ్రైనేజీ, పవర్‌బోర్‌ మరమ్మతులు తదితర సమస్యలను ఎమ్మెల్యేకు వివరించామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. అమీరుద్దీన్, గాలీకర్‌ దినేష్, సత్యనారాయణ, నరేష్, నవాబ్, కాశీనాథ్, కాలనీవాసులు సత్యనారాయణ, మల్లారెడ్డి, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాజిగిరి: సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ అధికారులకు సూచించారు. సత్యారాఘవేంద్రకాలనీలో సుమారు రూ.21 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రతి కాలనీలో యూజీడీ, తాగునీటి నూతన పైపులైన్‌ పనులు పూర్తి చేసి సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. డీఈ లౌక్య, వీఐ రజనీకాంత్, బాబు, సంపత్, కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌

గంగపుత్ర ఆత్మ గౌరవ భవనాన్ని త్వరలో పూర్తి చేస్తాం



ఉప్పల్‌ భగాయత్‌లో సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే మూఠా గోపాల్‌

ఉప్పల్: ఉప్పల్‌లో గంగపుత్ర ఆత్మగౌరవ భవన నిర్మాణం సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్‌ చైర్మన్, ముషీరాబాద్‌ ఎమ్మెల్యే మూఠా గోపాల్‌ అన్నారు. శనివారం ఉప్పల్‌ భగాయత్‌లో నిర్మిస్తున్న గంగపుత్ర ఆత్మగౌరవ భవనాన్ని ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌ హయాంలో కుల సంఘాలకు ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం కోకాపేట్, ఉప్పల్‌లో స్థలాలు కేటాయింపుతో పాటు నిధులు కూడా వెచ్చించిందని గుర్తుచేశారు. అదే సమయంలో ఉప్పల్‌లో కూడా గంగపుత్రుల ఆత్మగౌరవ భవనానికి మూడెకరాల స్థలం, రూ. 3 కోట్లను కేటాయించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణాన్ని అడ్డుకోవడం లాంటివి చేయొద్దని హితవు పలికారు. హనుమంత్, రామచందర్, మల్లేష్, సుదర్శన్, ప్రసాద్, గోరఖ్‌నాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాట్య ప్రదర్శనతో కళాకారులు

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నృత్య క్షేత్ర గురువు ఉత్తర విజయన్‌ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన అలరించింది. తోడయా మంగళం, గురు అష్టకం, అలరింపు, జతిస్వరం, పదం కీర్తనం శ్లోకాంజలి, సుత్తి, కావడి, తిల్లాన అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.